పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- లబ్ధిదారులకు నూతన పింఛన్ల అందజేత


పోరంకిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేదల భవిష్యత్‌ను తీర్చిదిద్దటానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో నాలుగు సర్కిళ్లలో ప్రభుత్వం కొత్తగా 677 సామాజిక పింఛన్లు మంజూరు చేయటంతో పోరంకిలో గురువారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. నేడు కొత్తగా పింఛన్లు మంజూరు చేసి ఇచ్చిన హామీ అమలు చేశారని తెలిపారు. గతంలో పింఛన్ మంజూరు చేయాలంటే అధికారులు, టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీల పెత్తనంతో పేదల పొట్టకొట్టారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో 18 లక్షల పింఛన్లు ఇస్తే మహానేత వైఎస్సార్ 63 లక్షల పింఛన్లు పేదలకు ఇచ్చి రికార్డు సృష్టించారన్నారు.

పేదలకు ఏమి గ్యారంటీ ఇస్తారు..

పేదల భవిష్యత్తుకు మా గ్యారంటీ అని టీడీపీ నేతలు తిరుగుతున్నారని, అసలు పేదలకు ఏమి గ్యారంటీ ఇస్తారని టీడీపీ నేతలకు ఎమ్మెల్యే పార్థసారథి సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత టీడీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇవ్వలేని గ్యారంటీ ఇప్పుడు అధికారం పోయిన తరువాత ఏమి ఇస్తారన్నారు. చంద్రబాబు ఏమి చేయక పోవటంతోనే ప్రజలు టీడీపీని ఇంటికి పంపారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని ప్రచారం చేశారని ఎంత మందికి జాబు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసిన అభివృద్ధి పనులపై టీడీపీ నేతలు చర్చకు రావాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, నాయకులు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, ఈడే చాముండేశ్వరి, చాంద్‌బాషా, కర్రా ఆదిశేషారావు, ఆకునూరు మాణిక్యం, అద్దేపల్లి చందు, చుండూరు శేఖర్, బొర్రా రమణయ్య, తాళ్ల నరేంద్ర, శ్రీనివాసరెడ్డి, క్రిష్టోఫర్, పున్నయ్యచౌదరి, నల్లమోతు జీవన్, సిద్దిక్, పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పింఛన్ పంపిణీ

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌ను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పంపిణీ చేశారు. పెనమలూరు గ్రామం సచివాలయం 2 పరిధిలో ఉంటున్న రాజులపాటి బాబురావుకు ప్రభుత్వం కొత్తగా పింఛన్ మంజూరు చేసింది. అయితే అతను అనారోగ్యం కారణంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. గ్రామ వలంటీర్ కొండిపాముల స్వాతి గురువారం ఆస్పత్రికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్ము బాబురావుకు అందజేసింది. వలంటీర్‌ను బాబురావు కుటుంబ సభ్యులు అభినందించారు.

కంకిపాడులో 20 మందికి..

కంకిపాడు: మండలంలోని నెప్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందని నాయకులు అన్నారు. మాజీ సర్పంచ్ కొణతం గిరిధర్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం గిరిబాబు, నాయకులు మండవ కిషోర్, రాయసం వెంకటరమణ, గుజ్జుల కోటేశ్వరరావు, బ్రహ్మం, స్థానిక యువత పాల్గొన్నారు.


నెప్పల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

రామవరప్పాడులో 53 మందికి మంజూరు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో కొత్తగా మంజూరైన 53 పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందన్నారు. ఉపసర్పంచ్ టంకసాల శివ, ఎంపీటీసీ సభ్యులు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గోపవరపుగూడెంలో..

గన్నవరం రూరల్: గోపవరపుగూడెం గ్రామంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 12 పెన్షన్‌లను సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులతో కలసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వార్డు సభ్యులు చిట్టినేని కార్తిక్, నాయకులు దొండపాటి జోజిబాబు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

పి.నైనవరంలో..

పి.నైనవరం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన లబ్ధిదారులకు సర్పంచి బట్టా సోమయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, సచివాలయ సిబ్బంది గురువారం నగదు పంపిణీ చేశారు. కొత్తగా 38 మందికి పింఛన్లు మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు. అంబాపురంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 24 మందికి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వినయ్, వలంటీర్లతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీచేశారు. పాతపాడులో కొత్తగా 26 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కులం, మతం, రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బండారుగూడెం సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ అన్నారు. బాపులపాడు మండలం బండారుగూడెంలోని గ్రామ సచివాలయంలో 17 మందికి నూతనంగా ఫించన్లు మంజూరైన వృద్ధాప్య పింఛన్లను ఆమె గురువారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు పరిమి మౌనిక, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పామర్తి ప్రభు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



ఉయ్యూరు: అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేడీసీసీ సేవలను విస్తృత పరుస్తున్నామని కేడీసీసీ బ్యాంక్ జిల్లా చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. ఉయ్యూరు కేడీసీసీ బ్యాంక్‌ను గురువారం ఆమె సందర్శించారు. బ్రాంచి పరిధిలోని పెనమకూరు పీఏసీఎస్ పరిధిలో రైతు కొల్లిపర వెంకటరామయ్య ఎద్దు ప్రమాదవశాత్తూ మృతి చెందింది. నష్ట పరిహారంగా మంజూరైన రూ.25 వేలను ఆమె అందజేశారు. రైతులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేడీసీసీని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. రైతులకు, డ్వాక్రా సంఘాలకు, గృహ నిర్మాణాలకు రుణాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం పి.గణేష్‌కుమార్, బీఎం తులసీ కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ సుధాకర్, పెనమకూరు సొసైటీ చైర్మన్ బోలెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబాపురం కార్యదర్శికి ఈఓఆర్డీగా ఉద్యోగోన్నతి

విజయవాడరూరల్: అంబాపురం, జక్కంపూడి క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న పి.భారతికి గ్రామ పంచాయతీ విస్తరణ, గ్రామాభివృద్ధి అధికారి(ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, రూరల్ డెవలప్‌మెంట్)గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమెను జి.కొండూరు ఈఓఆర్డీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అంబాపురం, జక్కంపూడి క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పాతపాడు కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావుకు అదనపు బాధ్యతలను అప్పగించారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: స్థానిక తన కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, వినతులను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులపై నాయకులతో చర్చించారు. ఎంపీపీ అనగాని రవి, నేతలు పాల్గొన్నారు.

రేపు స.హ. చట్టంపై అవగాహన సదస్సు

రామవరప్పాడు: సమాచార హక్కు కార్యకర్తల సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 16వ తేదీన 'సమాచార హక్కు చట్టం 2005'పై అవగాహన సదస్సు జరుగుతుందని సంఘ ప్రతినిధి పి.వీరబాబు గురువారం తెలిపారు. సమాచార హక్కు కార్యకర్తల సంఘ ప్రతినిధులు హాజరై సూచనలు ఇస్తారన్నారు.

ముగిసిన శ్రావణమాస పూజలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేంచేసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నెల రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ సహస్ర నామ పూర్వక కుంకుమార్చనలు గురువారం ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన జరిపారు.

ఘనంగా చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడులో వేంచేసిన శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గురువారం శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ ఈఓ పి.లోకేశ్వరి పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబానికి ఆర్థిక సాయం

పెనమలూరు: పెనమలూరు గ్రామ మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ నేత మరీదు మస్తాన్‌రావు మృతి చెందటంతో ఆయన కుటుంబానికి పెనమలూరు సొసైటీ నుంచి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సొసైటీ అధ్యక్షుడు వేమూరి నాగరవి, సీఈవో సురేష్‌బాబు మాజీ సర్పంచ్ కుమారుడు గురుప్రసాద్‌కు అందజేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుల నియామకం



కంకిపాడు: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులుగా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన ఇరువురు నాయకులు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులుగా కంకిపాడు మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఉప్పలూరు మాజీ సర్పంచ్ బందెల సుబ్బారావును నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి.

హోరాహోరీగా క్రీడా పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాపోటీలు రెండోరోజైన గురువారం ఉత్సాహభరితంగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన దాదాపు 180 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం పి.నిర్మల ఈ పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. నిర్వహించారు. పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. వీరవల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ గూడవల్లి రత్నసుధాకర్, తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ చందు రాజా, బాపులపాడు జెడ్పీ హైస్కూల్స్ హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, పీడీలు బి.ఎస్.రామచంద్రుడు, జి.సుబ్బారావు, లక్ష్మణరావు, తాన్యా గిరి, వ్యాయామోపాధ్యాయులు భాగ్యరాజు, పిళ్లా, బలరామ్, గణేష్, స్వామి, నారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రెండో రోజైన గురువారం బాలికల విభాగంలో పోటీలు నిర్వహించారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పుణ్యా చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్, సర్పంచి నిడమర్తి సౌజన్య, హెచ్‌ఎం ఎన్.రవీంద్రభవాని, క్రీడల మండల సమన్వయకర్త ధనియాల నాగరాజు, సబ్ జోన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన పెదఅవుటపల్లి విద్యార్థులు

ఉంగుటూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు పెద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం కె.శేషుకుమారి తెలిపారు. నున్న జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తమ విద్యార్థులు బి.శ్యామల, ఎం.ప్రశాంత్‌కుమార్ సత్తాచాటి రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 23న వికాస్ కాలేజీలో జరిగే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వారు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పీడీ రాంబాబు, విద్యార్థులను ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ బాధ్యులు అభినందించారు.

కోలవెన్ను విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కోలవెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో కబడ్డీలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో సత్తా చాటి మండల స్థాయిలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో విద్యార్థులను జోనల్ పోటీలకు ఎంపిక చేశారు. పునాదిపాడులో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కోలవెన్ను పాఠశాలకు చెందిన జూనియర్స్ విభాగంలో ఇద్దరు క్రీడాకారులు, సీనియర్స్ విభాగంలో ఒకరు రాణించి జోనల్ పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ సిహెచ్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ కంచర్ల చిన్ని, హెచ్‌ఎం ఎస్.రాంబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాషా అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ సీహెచ్ సుశీలను మండల కోఆర్డినేటర్ ఎం.హరిగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు భవాని, మురళి, సాయి, శ్రీనివాస్ అభినందించారు.

క్లుప్తంగా

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పెనమలూరు: ఏపీసీపీడీసీఎల్‌లో షిఫ్ట్ ఆపరేటర్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు వేతనం పెంచాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. కానూరులో ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు గురువారం పార్థసారథిని కలిసి సమస్యలు విన్నవించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం మొదటి ఏడాది విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, హెచ్‌వోడీ ఎం.శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ఉంగుటూరు: యువత క్రమశిక్షణతో, గురువులపై విధేయతతో ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ అమల సూచించారు. మండలంలోని ఆత్కూరులో స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యాక్సెస్ టు జస్టిస్ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ గ్రామీణ్ డైరెక్టర్ అంకమ్మరావు, ప్రశాంతి పాల్గొన్నారు.

అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్న ఎన్‌ఆర్‌ఐపై కేసు

గన్నవరం: ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌పై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్న ఎన్‌ఆర్‌ఐపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కెనడాలోని టొరంటోలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు యనమదల సందీప్ కొంత కాలంగా ఎమ్మెల్యే వంశీమోహన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు ఈ నెల ఆరో తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సందీప్‌ను పెనమలూరు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 17, 18 వార్డుల్లో చెత్త సేకరణకు కొత్త విద్యుత్ ఆటోను గురువారం ప్రారంభించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ రాజులపాటి చిన్ని, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నేతలు షేక్ అబుకలాం, అబ్దుల్ సద్దాం, అహ్మద్ ఖాన్, బిస్మిల్లా ఖాన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి.సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

పెనమలూరు: మండల పరిధిలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని పాఠశాల విద్యార్థులతో కలిసి ఘనంగా జరిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం కనకదుర్గ పర్యవేక్షించారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవంలో భాగంగా పీబీ సిద్ధార్థ కాలేజీ హిందీ విభాగాధిపతి ఎం.జయలక్ష్మి పాల్గొని హిందీ భాష విశిష్టతను వివరించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయిని జె.పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన భాషాంశాల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎన్.లూథర్ పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.ప్రేమ్ సాగర్‌కు వైద్య ఖర్చుల కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం రూ.15,500 ఆర్థికసాయం అందించింది. ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో ఈ మొత్తాన్ని ప్రేమ్‌సాగర్ తండ్రి శంకరంనకు అందించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, ప్రతినిధులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, పాత్రోలు గణేష్ పాల్గొన్నారు.

435 మందికి ఉచిత వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో వాణి విద్యానికేతన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మ్యాక్సివిజన్, వీజీఆర్ డయాబెటిస్, డ్రియా బెటర్ బ్రిష్‌లైట్ హాస్పిటల్, దుహిత హాస్పిటల్స్, విజయవాడ ఐకేర్ ఆప్టికల్స్‌కు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు. 435 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని జగనన్న కాలనీకి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు తెలిపారు. విలేజి కండ్రిక, పాతపాడు, వెంకటాపురం, అప్పారావుపేట, పి.నైనవరం, అంబాపురం, షాబాదు, జక్కంపూడి, వేమవరం, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరు ఆశ్రమం కాలువ కట్టకు చెందిన విద్యార్థిని అదృశ్యమవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు కాలువ కట్టపై దేవరపల్లి కృష్ణవేణి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. ఆమె పోరంకిలోని ఓ పచ్చళ్ల కంపెనీలో పని చేస్తోంది. ఆమె కుమార్తె(15) గంగూరులో పదవ తరగతి చదువుతుంది. ఈ నెల 6న కృష్ణవేణి పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ ఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో దంపతులపై కేసు

పెనమలూరు: గోసాలలో మహిళతో పాటు పలువురిపై దాడి చేసిన దంపతులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల వైకుంఠపురం వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన దొడ్డి కృష్ణవేణి భర్త గౌరినాయుడితో నివాసం ఉంటోంది. వారు ఉంటున్న ఇంటి పక్క పోర్షన్‌లో సింగపల్లి శ్రీను ఉంటున్నాడు. శ్రీను బావమరిది గంగరాజు, అతని భార్య కామేశ్వరి శ్రీను ఇంటికి వచ్చి శ్రీనుపై దాడి చేశారు. ఇది చూసిన కృష్ణవేణి, ఆమె భర్త గౌరినాయుడు అడ్డుకోగా గంగరాజు కర్రతో కృష్ణవేణి తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగరాజు, కామేశ్వరిపై కేసు నమోదు చేశారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాలతో ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

బృందాల ఏర్పాటు

ఈనెల 30న కంకిపాడు-2 సచివాలయం, అక్టోబర్ 1న కుందేరు, 4న ప్రొద్దుటూరు, 5న పునాదిపాడు-1, 6న మంతెన, 7న కోలవెన్ను, 9న వేల్పూరు, 10న ఈడుపుగల్లు-2, 11న ఈడుపుగల్లు-1, 12న నెప్పల్లి, 16న మద్దూరు, 17న తెన్నేరు, 18న దావులూరు, 19న కంకిపాడు-1, 20న కంకిపాడు-3, 21న గొడవర్రు, 24న పునాదిపాడు-2 సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. కంకిపాడు, ఉప్పలూరు పీహెచ్‌సీల పరిధిలోని వైద్య బృందం వైద్యసేవలు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అన్ని గ్రామాల్లోనూ ఇంటింటి సర్వే వలంటీర్ల ద్వారా జరుగుతుందన్నారు. రెండు మండల స్థాయి బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. టీమ్-1లో ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, డెప్యూటీ తహసీల్దార్ టి.నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ టి.స్వరూప్‌కుమార్‌రాజు, టీమ్-2లో తహసీల్దార్ పి.ఎస్.వి. ప్రసాద్, ఈఓఆర్డీ పీవీఎస్ మైథిలి, ఎంఆర్‌ఐ జి.రాఘవరావు ఉంటారని వివరించారు.